సంపుటి :02 సంచిక :110 పేజీలు :05
వెల ₹5
# అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people
ఉష్ణోగ్రతలు
కనిష్ఠం : 27
గరిష్ఠం : 34
బుధవారం 18, జూన్ 2025

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- 45, 46 డివిజన్లలో క్షేత్ర స్థాయిలో సందర్శన

03

## మావోయిస్టు పార్టీ అగ్రనేత
# గణేశ్ ఎన్ కౌంటర్



### ఉలిక్కిపడిన వెలిశాల

ఏపీలోని మారేడుమిల్లిలో ఎదురుకాల్పులు

మావోయిస్టులు, గ్రేహౌండ్స్ మధ్య భీకర పోరు

ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో తుపాకుల మోత మోగింది. బుధవారం తెల్లవారుజామున మావోయిస్టులు, గ్రేహౌండ్స్ బలగాల మధ్య భీకర పోరు జరిగింది. కాల్పుల్లో మావోయిస్టు పార్టీ ఆంధ్రప్రదేశ్ ఒడిశా బార్డర్ (ఏవోబీ) స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శి, సెంట్రల్ కమిటీ మెంబర్ గాజర్ల రవి అలియాస్ గణేశ్ అలియాస్ ఉదయ్, ఏవోబీ పార్టీ సభ్యురాలు అరుణతో పాటు మరో మావోయిస్టు మృతిచెందారు. జవాన్లు ఘటనా స్థలంలో మరో మావోయిస్టు మృతదేహాన్ని కూడా గుర్తించారు. మృతుడి వివరాలు తెలియరాలేదు.

– అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి

- కాల్పుల్లో పార్టీ నేత గణేశ్, మహిళా నేత అరుణ, మరో మావోయిస్టు మృతి
- మూడో మృతదేహాన్ని గుర్తించే పనిలో పోలీస్‌వర్గాలు
- ఏఓబీ స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శిగా గణేష్ బాధ్యతలు
- గణేశ్ స్వస్థలం భూపాలపల్లి జిల్లాలోని వెలిశాల గ్రామం
- 2004లో శాంతి చర్చలకు పార్టీ ఉత్తర తెలంగాణ ప్రతినిధిగా గణేష్
- ఆయన సోదరుడు ఆజాద్ మేడారం అడవుల్లో జరిగిన ఎన్ కౌంటర్ లో మృతి
- అజ్ఞాతాన్ని వీడిన మరో సోదరుడు గాజర్ల అశోక్ అలియాస్ ఐతు
- కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్న అశోక్
- అనేక సంచలనాలు సృష్టించిన గణేష్ ఎన్ కౌంటర్ తో విషాదం
- మృతదేహం కోసం అల్లూరి జిల్లాకు బయలుదేరిన గణేష్ కుటుంబ సభ్యులు

02



అరుణ (ఫైల్)

### వెలిశాల బిడ్డ..

నిన్నమొన్నటి వరకు స్తబ్దుగా ఉన్న వెలిశాల గ్రామం ఉక్కసారిగా ఉలిక్కిపడింది. ఏపీలోని మారేడుమిల్లి అటవీప్రాంతంలో మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో గాజర్ల రవి అలియాస్ గణేశ్ అమరుడయ్యాడు. విప్లవోద్యమకారులకు పుట్టినిల్లయిన జయశంకర్‌భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని వెలిశాల గ్రామం ఎందరో విప్లవకారులకు జన్మనిచ్చింది. పెత్తందారి వ్యవస్థ, భూస్వాముల అరాచకాలకు ఎదురు తిరిగే ఉద్యమకారులకు పురుడు పోసింది. అలాంటి పోరాటాల గడ్డ నుంచి పుట్టిన గణేశ్.. చిన్నతనంలో వామపక్ష రాజకీయాలకు ఆకర్షితుడయ్యాడు. పీపుల్స్‌వార్ పార్టీలో చేరి మావోయిస్టు పార్టీలో కీలక నేతగా ఎదిగాడు. నాలుగు దశాబ్దాల పాటు పార్టీకి సేవలందించి, చివరకు తాజాగా ఏపీలో జరిగిన ఎన్‌కౌంటర్ లో ప్రాణాలొదిలాడు.

05

## విప్లవోద్యమ చరిత్రలో చిట్యాల


- పేద వర్గాలకు అండగా నిలిచి భూస్వాముల పెత్తనాన్ని తరిమిన అన్నలు
- నాడు సమాంతర పాలన నడిపి చిట్యాల మండలాన్ని తమ ప్రయోగశాలగా చేసుకున్న పరిస్థితి
- ఉమ్మడి చిట్యాల మండలం నుంచి 32 మంది అమరులు కాగా మిలిటెంట్లుగా మిగిలిపోయిన 1,200 మంది
- నాటి చర్చల ప్రతినిధి నేడు విగత జీవిగా మారడంతో విషాద ఛాయలు




## 38 మంది ఇంజినీర్లకు
# తాఖీదులు

- మూడు వారాల్లో వివరణ ఇవ్వాలని ఇరిగేషన్‌శాఖ ఆదేశం
- ‘మేడిగడ్డ’ కుంగుబాటుపై విజిలెన్స్ నివేదిక
- సిఫార్సుల అమలుపై ఇరిగేషన్‌శాఖ జాప్యం
- సీఎం మందలింపుతో రిపోర్టుపై కదలిక

04




## కన్నతండ్రిని హతమార్చిన
# కసాయి కూతురు

- వివాహమైన వ్యక్తితో కుమార్తె అక్రమ సంబంధం
- తండ్రి మందలించడంతో హత్యకు పథక రచన
- ప్రియుడిని ఇంటికి పిలిపించుకుని తండ్రి హత్య
- మానుకోట జిల్లా జెండాల తండాలో వెలుగు చూసిన ఘటన

03

## ఏసీబీ వలలో విద్యుత్తు ఎస్ఈ



- రూ.80 వేలు లంచం తీసుకుంటూ దొరికిన నరేష్
- గతంలో రూ.20 వేలు తీసుకున్న ఎస్ఈ

05

### ఆత్మహత్యకు పాల్పడిన
# ఆర్మీ జవాన్ మృతి



అక్షర దర్బార్, శాయంపేట : కుటుంబ కలహాలతో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఆర్మీ జవాన్ మరణించారు. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన అరికిల్ల ప్రవీణ్ (28) సికింద్రాబాద్ తిరుమలగిరిలోని టెరిటోరియల్ ఆర్మీ బెటాలియన్ 125లో విధులు నిర్వహిస్తున్నాడు. తన భార్య కొంత కాలంగా వేధింపులకు గురి చేయడంతో పాటు మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తోందని, దీంతో మనస్థాపానికి గురైన ప్రవీణ్ ఈ నెల 8న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అప్పటి నుంచి పుణెలోని మిలటరీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలోనే పరిస్థితి విషమించి బుధవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే తన ఆత్మహత్యకు భార్య, అత్త మామలే కారణమని ప్రవీణ్ అంతకుముందు ఓ వీడియోలో వెల్లడించారు.

# రాఘవేంద్ర నగర్ లో విశేష పూజలు





అక్షరదర్బార్, వరంగల్: పూర్వభాద్ర జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని వరంగల్ పైడిపల్లిలోని శ్రీ రాఘవేంద్ర నగర్ లో శ్రీ అభయాంజనేయ స్వామి వారికి స్థానికులు విశేష పూజలు నిర్వహించారు. కాలనీవాసులను వేద పండితులు ఆశీర్వదించారు. విశేష పూజల్లో కాలనీ కమిటీ అధ్యక్షుడు పిన్నింటి ప్రకాష్ రావు దంపతులతో పాటు కాలనీ పెద్దలు మామిడిపల్లి చిరంజీవి, శ్రీరామోజు మహేందర్, మోత్కూరి ఆంజనేయులు, శాతరాజు నరసింహారావు, గుంటి తిరుపతి, చాతరాజు గణపతి రావు, దిండిగాల ప్రభాకర్, తిరువూరు దేవి ప్రసాద్, సీహెచ్ సంపత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీలో మహా అన్నదాన కార్యక్రమం జరిగింది.



## మావోయిస్టు పార్టీ అగ్రనేత
# గణేశ్ ఎన్‌కౌంటర్

- ఉలిక్కిపడిన వెలిశాల
- ఏపీలోని మారేడుమిల్లిలో ఎదురుకాల్పులు
- మావోయిస్టులు, గ్రేహౌండ్స్ మధ్య భీకర పోరు
- కాల్పుల్లో పార్టీ నేత గణేశ్, మహిళా నేత అరుణ, మరో మావోయిస్టు మృతి
- మూడో మృతదేహాన్ని గుర్తించే పనిలో పోలీస్వర్గాలు
- ఏఓబీ స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శిగా గణేష్ బాధ్యతలు
- గణేశ్ స్వస్థలం భూపాలపల్లి జిల్లాలోని వెలిశాల గ్రామం
- 2004లో శాంతి చర్చలకు పార్టీ ఉత్తర తెలంగాణ ప్రతినిధిగా గణేష్
- ఆయన సోదరుడు ఆజాద్ మేడారం అడవుల్లో జరిగిన ఎన్ కౌంటర్ లో మృతి
- అజ్ఞాతాన్ని వీడిన మరో సోదరుడు గాజర్ల అశోక్ అలియాస్ ఐతు
- కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్న అశోక్
- అనేక సంచలనాలు సృష్టించిన గణేష్ ఎన్ కౌంటర్ తో విషాదం
- మృతదేహం కోసం అల్లూరి జిల్లాకు బయలుదేరిన గణేష్ కుటుంబ సభ్యులు



**అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి:**

ఆంధ్రప్రదేశ్లోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీప్రాంతంలో బుధవారం తెల్లవారుజామున భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ ఒడిశా బార్డర్ (ఏవోబీ) స్పెషల్ జోన్ కమిటీ సెక్రటరీ గాజర్ల రవి అలియాస్ గణేశ్ అలియాస్ ఉదయ్, పార్టీ మహిళా నాయకురాలు రవి వెంకట చైతన్య అలియాస్ అరుణతో పాటు మరో మావోయిస్టు మృతిచెందారు. మూడో మావోయిస్టు వివరాలు తెలియరాలేదు. మారేడుమిల్లి అటవీప్రాంతం కింటుకూరులో మావోయిస్టు పార్టీ అగ్రనేతల సంచారం ఉన్నదనే సమాచారం అందుకున్న ఏపీ పోలీసు ఉన్నతాధికారులు వెంటనే ఆ ప్రాంతానికి భారీగా గ్రేహౌండ్స్, భద్రతా దళాలను మోహరింపజేశారు. అక్కడ కూంబింగ్ చేపడుతుండగా, ఈ క్రమంలో వారికి 16 మంది మావోయిస్టుల బృందం తారసపడి కాల్పులు ప్రారంభించారు. అప్రమత్తమైన జవాన్లు ఎదురుకాల్పులకు దిగారు. ఇరువర్గాల మధ్య సుమారు 20 నిమిషాల పాటు భీకరపోరు జరిగింది. జవాన్ల ధాటికి తాళలేని మావోయిస్టులు కాల్పులు జరుపుతూ దట్టమైన అటవీప్రాంతానికి పరారయ్యారు. అనంతరం జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకున్నారు. ఘటనా స్థలంలో ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించారు. మృతులను మావోయిస్టు పార్టీ అగ్రనేత గాజర్ల రవి, పార్టీ నాయకురాలు అరుణగా గుర్తించారు. మరో మృతదేహాన్ని గుర్తుపట్టేందుకు పోలీసులు యత్నిస్తున్నారు. ఘటనా స్థలంలో మూడు ఏకే 47 తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన మావోయిస్టుల కోసం కూడా గ్రేహౌండ్స్ బలగాలు కూంబింగ్ కొనసాగిస్తున్నాయి. కాగా ఉదయ్, అరుణలపై రివార్డులు ఉన్నట్టు సమాచారం.

## మిగిలిన 16 మంది వీరే..

కేంద్ర కమిటీలో ప్రస్తుతం 16 మంది ఉన్నట్లు సమాచారం. వీరిలో ఏపీ, తెలంగాణకు చెందిన వారు 11 మంది కాగా, జార్ఖండ్‌కు చెందినవారు ముగ్గురు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు ఇద్దరున్నారు. ఏపీ, తెలంగాణకు చెందిన వారు మల్లోజుల వేణుగోపాలరావు అలియాస్ సోనూ, తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కోసా, మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి, మోడెం బాలకృష్ణ, పాక హన్మంతు అలియాస్ ఊకే గణేష్, కట్టా రామచంద్రారెడ్డి అలియాస్ రాజుదాదా, గాజర్ల రవి అలియాస్ ఉదయ్, పసునూరి నరహరి అలియాస్ విశ్వనాథ్, పోతుల కల్పన. జార్ఖండ్‌కు చెందిన వారు మిసిర్ బెస్రా అలియాస్ సునీల్, అనల్ దా అలియాస్ పాతిరాం మాంఝీ, సహదేవ్ అలియాస్ అనూజ్. ఛత్తీస్ గఢ్‌కు చెందిన వారు మాఝీదేవ్ అలియాస్ రాంధీర్, మాడ్వి హిడ్మా. వీరిలో పలువురు 60 ఏళ్లకు పైబడినవారే.

### - అరుణ ఎవరంటే..

అరుణ స్వస్థలం ఏపీలోని విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం కరకవానిపాలెం. రెండున్నర దశాబ్దాల క్రితం ఆమె మావోయిస్టు పార్టీ ఉద్యమంలోకి వచ్చింది. ఆమె సోదరుడు, మావోయిస్టు పార్టీ గాలికొండ ఏరియా కమాండర్ ఆజాద్ కూడా 2015లో కొయ్యూరులో జరిగిన ఎదురుకాల్పుల్లో మృతిచెందాడు.

### - తగ్గిన సభ్యుల సంఖ్య..

మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీ సభ్యుల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. 21 ఏళ్ల క్రితం పార్టీ ఆవిర్భావం సమయంలో 42 మంది సభ్యులుగా ఉండేవారు. ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లతో సభ్యుల సంఖ్య తగ్గింది. జనవరిలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దుల్లోని కుల్హదీఘాట్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడైన రామచంద్రారెడ్డి అలియాస్ జయరాం, అలియాస్ చలపతి మరణించారు. ఆ తర్వాత మే నెలలో బీజాపూర్ జిల్లా ఉసూర్ సమీపంలోని లంకపల్లి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న మరణించారు. అదే నెలలో నారాయణపూర్‌లో జరిగిన భీకర ఎన్‌కౌంటర్‌లో ఏకంగా మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ప్రాణాలు కోల్పోయారు. మావోయిస్టు పార్టీ చరిత్రలో ఎన్‌కౌంటర్‌లో పార్టీ ప్రధాన కార్యదర్శి మరణించటం ఇదే ప్రథమం. ఆ ఎన్‌కౌంటర్‌లో కేశవరావుతోపాటు 27 మంది మావోయిస్టులు మరణించిన విషయం తెలిసిందే. తాజాగా గురువారం బీజాపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో కేంద్ర కమిటీ సభ్యుడు, ఏపీకి చెందిన తెంటు నర్సింహాచలం అలియాస్ సుధాకర్ (64) చనిపోయారు. ఈ విధంగా ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ నలుగురు కేంద్ర కమిటీ సభ్యులు ఎన్‌కౌంటర్లలో మరణించారు. ఇక మిగిలిన 16 మందిలో 11 మంది తెలుగువారే కావడం గమనార్హం.

# ఉలిక్కిపడిన వెలిశాల

గాజర్ల రవి అలియాస్ గణేశ్ అలియాస్ ఉదయ్ ఎన్కౌంటర్తో వెలిశాల గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ గ్రామం నుంచి మావోయిస్టు పార్టీలోకి ఎందరో నేతలు వెళ్లారు. నాలుగు దశాబ్దాల క్రితమే గ్రామం విప్లవోద్యమానికి కేంద్రంగా ఉండేది. మావోయిస్టు పార్టీ అగ్రనేత ఆజాద్ ఈ గ్రామం నుంచే మావోయిస్టు పార్టీలోకి వెళ్లాడు. కొన్నేళ్ల క్రితం జరిగిన ఎన్కౌంటర్లో ప్రాణాలు కోల్పోయాడు. 2003లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై అలిపిరి వద్ద జరిగిన బాంబ్ బ్లాస్టో గణేశ్కు సంబంధం ఉందని, అదే కాక గణేశ్కు పలు విధ్వంసకర ఘటనలతో ప్రమేయం ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. 2004లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్రెడ్డి నక్సలైట్లతో నిర్వహించిన శాంతిచర్చలకు గణేశ్ ఉత్తర తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించారు. మావోయిస్టు పార్టీలో నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వెలిశాల ఆయన స్వగ్రామం. చదువు




కునే రోజుల్లోనే ఆయన వామపక్ష ఉద్యమాల పట్ల ఆకర్షితుడయ్యాడు. రాడికల్ స్టూడెంట్ యూనియన్లో చేరి కీలక నేతగా ఎదిగాడు. అన్న ఆజాద్ బాటలో నడిచి నాటి పీపుల్స్ వార్లో చేరాడు. వరంగల్ నగరంలో చదువుకున్న గణేష్ అజ్ఞాతంలోకి వెళ్లిన తర్వాత ఎక్కువగా అటవీ ప్రాంతంలో పనిచేశారు. ఖమ్మం, కొత్తగూడ, ఏటూరునాగారం ప్రాంతాల్లో పార్టీ కార్యకలాపాల్లో కీలక పాత్ర వహించారు. అనేక సంచలనాలకు కేంద్ర బిందువుగా నిలిచారు. ఏటూర్ నాగారం అటవీ ప్రాంతంలో జరిగిన పలు సంఘటనల్లో గణేష్ పాత్ర ఉందని అప్పట్లో పోలీసుల ప్రకటించారు. చింతగూడెం బస్ బ్లాస్టింగ్ వంటి ఘటన వెనుక కూడా గణేష్ ఉన్నట్లు నాడు వార్తలు వెలువడ్డాయి. ఆయన కొంతకాలం వరంగల్ డివిజన్ కమిటీని కూడా ముందుకు నడిపించారు. ఉత్తర తెలంగాణ స్పెషల్ జోన్ కమిటీ సభ్యుడిగా సేవలందించారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎదిగారు. గణేశ్ సోదరుడు గాజర్ల భాస్కర్ అలియాస్ ఆజాద్ ఆజాద్, అతని భార్య రూప కూడా గతంలో ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం అడవుల్లో జరిగిన ఎన్కౌంటర్లో మృతిచెందారు. గణేష్ భార్య జిలానీ కూడా ఎదురుకాల్పుల్లోనే కన్నుమూసింది. గాజర్ల రవి సోదరుడు అలియాస్ గాజర్ల అశోక్ అలియాస్ ఐతు కొన్నేళ్ల క్రితం మావోయిస్టు పార్టీని వీడి జన జీవన స్రవంతిలోకి వచ్చారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీనేతగా, పార్టీ అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. గణేష్ మృతితో వెలిశాల గ్రామంలో విషాదం అలుముకుంది. మృతదేహం కోసం గణేష్ కుటుంబ సభ్యులు బుధవారం వరంగల్ నుంచి ఏపీలోని అల్లూరి జిల్లాకు బయలుదేరారు.

## గణపతి కాలేజీలో
# యోగా శిక్షణ

- **యోగాతో దీర్ఘకాలిక వ్యాధులు మాయం**
- **యోగ గురువు కొలుగూరి రాజేశ్వర్ రావు**



అక్షర దర్బార్, పరకాల : అంతర్జాతీయ యోగా డే సందర్భంగా యోగా గురువు కొలుగూరి రాజేశ్వర్ రావు ఆధ్వర్యంలో పరకాల పట్టణం గణపతి కాలేజీలో ఉచిత యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకొని యోగాతో ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులు బీపీ, షుగర్, అస్తమా, థైరాయిడ్ సమస్యల నుండి ఉపశమనం పొందుతారని తెలిపారు.

## బయటకు వెళ్లేప్పుడు
# జాగ్రత్తలు తీసుకోవాలి

**దుగ్గొండి ఎస్సై రణధీర్ రావుల**



అక్షర దర్బార్, దుగ్గొండి : వివిధ పనుల నిమిత్తం ఇండ్ల నుండి బయటకు వెళ్ళే ప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని దుగ్గొండి ఎస్సై రణధీర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఇందుమూలంగా దుగ్గొండి మండల గ్రామ ప్రజలకు తెలియజేయునది ఏమనగా మీ మీ బంధువుల ఇండ్లకు గాని, తీర్థయాత్రలు గాని, ఏదైనా పని నిమిత్తం బయటికి వెళ్లినప్పుడు మీ ఇండ్లకు తాళాలు వేసి పోయేటప్పుడు తలుపులకు సెంట్రల్ లాకింగ్ ఉండే విధంగా జాగ్రత్తలు పడాలని సూచించారు.అలాగే ఇంట్లో ఉండే విలువైన వస్తువులను తమతో పాటు తీసుకెళ్ళాలని లేనిపక్షంలో ఇంట్లో ఒకరు ఉండే విధంగా చూసుకోవలని ఎస్సై రణధీర్ తెలియజేశారు.



## కన్నతండ్రిని హతమార్చిన
# కసాయి కూతురు

- **వివాహితుడితో కుమార్తె అక్రమ సంబంధం**
- **తండ్రి మందలించడంతో హత్యకు పథక రచన**
- **ప్రియుడిని ఇంటికి పిలిపించుకుని తండ్రి హత్య**
- **మానుకోట జిల్లా జెండాల తండాలో వెలుగు చూసిన ఘటన**



అక్షరదర్బార్, మరిపెడ: అల్లారుముద్దుగా పెంచుకున్న కుమార్తె అప్పటికే వివాహమైన వ్యక్తితో ప్రేమాయణం సాగిస్తున్నది. 'ఇది తప్పమ్మా.. జీవితం నాశనం చేసుకోకు..' అని మందలించిన తండ్రిని కుమార్తె మట్టుపెట్టాలని పథకం రచించింది. పక్కా ప్లాన్‌తో ప్రియుడు మరికొంతమందిని తన ఇంటికి పిలుపించుకున్నది. వారి సాయంతో తండ్రిని తాళ్లతో బంధించింది. పాశవికంగా దాడి చేసి హతమార్చింది. ఈ హృదయ విదారక ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం డీఎస్సార్ జెండాల తండాలో బుధవారం తెల్లవారుజామున వెలుగు చూసింది. మరిపెడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన ధరావత్ కిషన్ (50) కుమార్తె పల్లవి వరంగల్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ పూర్తి చేసింది. కొన్నాళ్లుగా ఇంట్లోనే ఉంటున్నది. ఈక్రమంలో ఆమె అప్పటికే వివాహమైన ఇదే గ్రామానికి చెందిన సురేశ్‌తో అక్రమ సంబంధం పెట్టుకున్నది. ఇది తెలిసిన తండ్రి కిషన్ ఆమెను మందలించాడు. సురేశ్‌కు ఇప్పటికే నేరచరిత్ర ఉందని, జీవతం నాశనం చేసుకోవద్దని హెచ్చరించాడు. దీంతో పల్లవి కోపోద్రిక్తురాలై తండ్రి హత్యకు పథకం రచించింది. మంగళవారం రాత్రి ప్రియుడు సురేశ్‌తో పాటు మరికొందరిని ఇంటికి పిలిపించింది. తండ్రిని తాళ్లతో బంధించి దాడి చేసి హతమార్చింది. బుధవారం తెల్లవారుజామున కిషన్‌ను కుటుంబ సభ్యులు విగత జీవిగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితులపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

# ఏసీబీ వలలో విద్యుత్తు ఎస్ఈ

- **రూ.80 వేలు లంచం తీసుకుంటూ దొరికిన నరేష్**
- **గతంలో రూ.20 వేలు తీసుకున్న ఎస్ఈ**



అక్షరదర్బార్, మహబూబాబాద్: అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు లంచగొండిపరుల భరతం పడుతున్నారు. రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుని లంచావతారాలను కటకటాల్లోకి తోస్తున్నారు తాజాగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఓ జిల్లా స్థాయి అధికారి ఏసీబీ వలకు చిక్కాడు. ఎన్పీడీసీఎల్ మహబూబాబాద్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ (ఎస్ఈ) జనగం నరేష్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. పనిచేసి పెట్టేందుకు ఓ కాంట్రాక్టర్ ను ఎస్ఈ నగేష్ రూ.లక్ష లంచం డిమాండ్ చేశాడు. మహబూబాబాద్ జిల్లాలోని కురవి, మరిపెడ సబ్ డివిజన్లకు సంబంధించిన ప్రస్తుత అంగీకార లేఖల ఒప్పందాల కొనసాగింపును ఆమోదించేందుకు గతంలో నరేష్ రూ.20 వేలు లంచం తీసుకున్నాడు. బుధవారం ఉదయం 8 గంటలకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తన ఇంట్లో రూ.80 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అదుపులోకి తీసుకుని ఆయన నుంచి రూ.80 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈ నరేష్ ను కోర్టులో హాజరు పరుచనున్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.

## ఆ పోలీసు అధికారులపై
# చర్యలు తీసుకోవాలి

**- బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్ రావు**



అక్షరదర్బార్, వరంగల్: ఏ పదవి లేకున్నా మంత్రి భర్త హోదాలో కొండా మురళీధర్ రావుకు ఏసీపీతో సహా పోలీసులు రక్షణ వలయంగా సేవలు అందించడాన్ని బీజేపీ రాష్ట్ర పార్టీ కమిటీ సభ్యుడు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు బుధవారం ఖండించారు. కొద్ది రోజుల క్రితం కొండా మురళీధర్ రావు వరంగల్ లో పలు అధికారిక కార్యక్రమాలతో పాటు వివాహ విందులు, వినోదాలకు వెళ్ళి నప్పుడు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తో పాటు మిల్స్ కాలనీ, ఇంతేజార్ గంజ్, మట్టేవాడ సీఐలతోపాటు ఎస్సైలు, పోలీస్ సిబ్బంది ఎస్కార్ట్ గా వెళ్లడాన్ని ఆయన తప్పుపట్టారు. పోలీసుల పొరపాటును గుర్తించి వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ ఏసీపీ నందిరాంనాయక్ తోపాటు ఇతర పోలీసులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని స్వాగతించారు. షోకాజ్ నోటీస్ తో సరిపుచ్చకుండా తప్పు చేసిన వారిని విధుల నుంచి తప్పించాలని, ఏసీపీ నందిరాంనాయక్ తోపాటు బాధ్యులందరినీ తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే బీజేపీ పార్టీ పక్షాన ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు.

## పరిసరాలను
# శుభ్రంగా ఉంచుకోవాలి

- **బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**
- **45, 46 డివిజన్లలో క్షేత్ర స్థాయిలో సందర్శన**



అక్షరదర్బార్, హనుమకొండ: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. బుధవారం నగర పరిధిలోని 45, 46 డివిజన్ల లోని కడిపికొండ, రామన్నపేట ప్రాంతాల్లో కమిషనర్ క్షేత్ర స్థాయిలో సందర్శించి వంద రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భం గా కమిషనర్ 45వ డివిజన్ లో డీసిల్టింగ్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం అవగాహన ర్యాలీలో కమిషనర్ పాల్గొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించిన అవగాహనపై ముద్రించిన కరపత్రాలను స్థానికులకు అందజేసి గృహాలకు స్టికర్లను అంటించారు. శానిటేషన్ సిబ్బందితో మాట్లాడిన కమిషనర్ అటెండెన్స్ రిజిస్టర్ ను పరిశీలించి విధి నిర్వహణ తీరును సిబ్బందిని అడిగి తెలుసుకొని తగు సూచనలు చేశారు. ప్రధాన రహదారులతో పాటు అప్రోచ్ రోడ్లను శుభ్రంగా ఉంచాలని, ముందస్తు సమాచారం ఇవ్వకుండా గైర్హాజరూ కాకూడదని సూచించారు. డంప్ యార్డ్ ను క్షేత్ర స్థాయిలో సందర్శించి బయో మైనింగ్ నిర్వహణ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. వేయింగ్ మిషన్ (బరువు తూచే యంత్రం) పని తీరును కమిషనర్ పరిశీలించారు. రామన్న పేట ప్రాంతంలో గ్రేవీ యార్డును పరిశీలించి గేటును ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## ఫెర్టిలైజర్స్ పెస్టిసైడ్ అండ్ సీడ్స్
# నూతన కమిటీ ఎన్నిక

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండల ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ కమిటీని మంగళవారం నూతనంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా గుమ్మడి సత్యనారాయణ ఉపాధ్యక్షులు: సర్వ రాజు ప్రధాన కార్యదర్శి:పువ్వటి హరికృష్ణ సహాయ కార్యదర్శి: కైరిక కిషన్ రావు కోశాధికారి: జిన్నె వేణు కార్యవర్గ సభ్యులు: మేకల శ్రీనివాస్ గంజి రవీందర్ జోగు భాను చందర్మా మారెళ్ల దేవేందర్ రెడ్డి గుండెబోయిన మహేందర్ లను అందరమూ సమావేశమై ఏకగ్రీవంగా నూతన కమిటీ ని ఎన్నుకోవడం జరిగిందని నూతన కమిటీ అధ్యక్షులు గుమ్మడి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ప్రయోజనం కోసం తమ సంఘం పాటుపడుతుందని నకిలీ విత్తనాలు నకిలీ మందులు రాకుండా సమంత అధికారులకు సహకరిస్తామని ఆయన తెలిపారు.



# ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాలు



అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల జూన్ : చిట్యాల మండల కేంద్రంలోని చింతలపల్లి గ్రామం లో గల పెద్దమ్మ తల్లి కి బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముదిరాజుల ఇంటి ఇలావేల్పు అయినా పెద్దమ్మ తల్లికి ప్రతి ఇంటి నుండి బోనం ఎత్తుకొని డబ్బులు సప్పుల్ల తో మేక పిల్లలు గొర్రెపిల్లలు కోళ్లను పట్టుకొని ఊరేగింపుగా తీసుకువెళ్లి పెద్దమ్మ తల్లికి మొక్కులు అప్పగించారు గ్రామాన్ని చల్లగా చూడాలని గ్రామంలోకి ఎలాంటి చెడు శక్తులు కానీ చెడుగాలుగాని తాకకూడదని వేడుకుంటూ తమ పిల్లాపాపాలని చల్లంగా చూడాలని ఎలాంటి వ్యాధులకు గురికాకుండా ఆయురారోగ్యాలతో ఉండేలా దీవించాలని ఈ యేడు సమృద్ధిగా వానలు పడి పంటలు బాగా పండాలని ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలను సమర్పించారు ఈ కార్యక్రమంలో ముదిరాజుల కుటుంబాలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# రక్షణ చట్టాలపై అవగాహన

అక్షరదర్బార్, వెంకటాపురంనూగూరు: ములుగు జిల్లా ఎస్పీ ప్రారంభించిన అభయమిత్ర కార్యక్రమంలో భాగంగా వెంకటాపురం సీఐ బండారి కుమార్ ఆధ్వర్యంలో ప్రజల భద్రతకి రక్షణ కల్పించే చట్టాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం మండల కేంద్రంలోని స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ ఆవరణలో చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ బండారి కుమార్ మాట్లాడుతూ ప్రజల భద్రతకి రక్షణ కల్పించే చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించి తద్వారా నేర రహిత సమాజాన్ని నిర్మించడం, పోలీసులకు, ప్రజల మధ్య సత్సంబంధాలు పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో ఎస్సై కొప్పుల తిరుపతిరావు, శిక్షణ ఎస్సై ఎం సాయి కృష్ణ, యాంటీ డ్రగ్ కమిటీల్లో పనిచేస్తున్న సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.





# ఉచిత ఉపాధి శిక్షణ కోర్సులు

- నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి
- ప్రతిమ ఫౌండేషన్ సమన్వయకర్త వంగ గీతారెడ్డి

అక్షర దర్బార్ మల్హర్ : భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండలం తాడిచర్ల గ్రామం పాత గ్రామపంచాయతీ ఆవరణలో ప్రతిమ ఫౌండేషన్ సహకారంతో... జిఎంఆర్, టాటా స్ట్రైవ్ స్కిల్ డెవలప్మెంట్ శిక్షణా కేంద్రాల్లో బిజినెస్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్ (బ్యాంకింగ్), హోమ్ ఎయిడ్ హెల్త్,ఏసీ టెక్నీషియన్, ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, సోలార్ టెక్నీషియన్,మహిళలకు టైలరింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణను అందించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ప్రతిమ ఫౌండేషన్ సమన్వయకర్త గీతారెడ్డి అన్నారు.ఆయా కోర్సుల్లో చేరడానికి 18-30 సంవత్సరాల వయస్సులోపు కలిగి, కనీస విద్యార్హత కోర్సును బట్టి పదవతరగతి,ఇంటర్,డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతీ,యువకులు ఆయా కోర్సుల్లో చేరవచ్చుని, ప్రవేశాలకు ఈ నెల 25వ తేదీ లోపు 99597 94433, 6281840860 నెంబర్ యందు సంప్రదించి పేరు నమోదు చేసుకోవచ్చుని, శిక్షణాకాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఆర్గనైజర్లు ఉమా శంకర్, రాజ్ కుమార్, రాజశేఖర్ లు పాల్గొన్నారు.

# 38 మంది ఇంజినీర్లకు తాఖీదులు

- మూడు వారాల్లో వివరణ ఇవ్వాలని ఇరిగేషన్ శాఖ ఆదేశం
- 'మేడిగడ్డ' కుంగుబాటుపై విజిలెన్స్ నివేదిక
- సిఫార్సుల అమలుపై ఇరిగేషన్ శాఖ జాప్యం
- సీఎం మందలింపుతో రిపోర్టుపై కదలిక



అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి: కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పరిధిలోని మేడిగడ్డ బరాజ్ ఏడో బ్లాక్ కుంగుబాటుపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు ఇటీవల ఇరిగేషన్శాఖకు నివేదిక అందించింది. దీని ప్రకారం ఇరిగేషన్ అధికారులు మొత్తం 38 మంది ఇంజినీర్లకు మంగళవారం తాఖీదులు ఇచ్చింది. కుంగుబాటుపై మూడువారాల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. విజిలెన్ విభాగం ఇంజినీర్లతోపాటు నిర్మాణ సంస్థపైన క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు సిఫార్సు చేయగా, ఆ అంశాన్ని పక్కనపెట్టి అందరిపైన శాఖాపరమైన చర్యలకు వీలుగా ఇరిగేషన్శాఖ నోటీసులు ఇచ్చింది. విజిలెన్స్ అధ్యయనంలో తేలిన అంశాలు, ఇంజినీర్లు ఇచ్చిన సమాధానాలు, ఆయా సమాధానాలను తిరస్కరిస్తూ విజిలెన్స్ మోపిన అభియోగాల ఆధారంగా వివరణ కోరింది. వాస్తవానికి విజిలెన్స్ విభాగం మార్చిలోనే నివేదికగా అందించగా, ఇరిగేషన్శాఖ అందులోని సిఫార్సులను ఆలస్యంగా అమలు చేస్తున్నది. జాప్యంపై సీఎం ఇటీవల మంత్రులతో నిర్వహించిన భేటీలో ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆ తర్వాత నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, సలహాదారు ఆదిత్యనాథ్ దాస్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. విజిలెన్స్ సిఫార్సుల ప్రకారం చర్యలకు పూనుకోవాలని ఆదేశించారు. దీంతో తాజాగా 38 మంది ఇంజినీర్లకు తాఖీదులు జారీ అయ్యాయి.

**- తాఖీదులు అందుకున్న వారు..**

వాటిని అందుకొన్న వారిలో మాజీ ఈఎన్సీలు మురళీధర్, వెంకటేశ్వర్లు, ప్రస్తుత చీఫ్ ఇంజినీర్ సుధాకర్‌రెడ్డి, గతంలో కాళేశ్వరం ఎస్ఈగా పనిచేసి, ప్రస్తుతం చీఫ్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రమణారెడ్డి, మేడిగడ్డ ఈఈ తిరుపతిరావు ఉన్నారు. వీరే కాక కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో పనిచేసిన ఈఈలు, ఏఈఈలు, డీఈఈలు, క్వాలిటీ కంట్రోల్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ ఇంజినీర్లు, రాష్ట్ర స్థాయి స్టాండింగ్ కమిటీలోని డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అధికారులు ఉన్నారు. వీరిలో ఇప్పటికే పదవీ విరమణ చేసిన వారు కూడా ఉన్నారు.

# జంపన్న వాగు అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు



అక్షర దర్బార్, హైదరాబాద్ : మేడారం సమక్క-సారలమ్మ జాతరలో జంపన్న వాగుకు ఎంతో ప్రాముఖ్యత ఉన్నది. ఇక్కడ పర్యాటకుల వేల సంఖ్యలో పవిత్ర స్నానాలు చేస్తారు. జంపన్న వాగు అభివృద్ధికి ప్రభుత్వం రూ. 5 కోట్లు మంజూరు చేసింది. జంపన్న వాగు రివర్ ఫ్రంట్ అభివృద్ధికి రూ. 5 కోట్లు రిలీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు.



# పొంగులేటిని కలిసిన కలెక్టర్ స్నేహ శబరీష్

**- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కూడా..**

అక్షరదర్బార్, హనుమకొండ: రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఇటీవల హనుమకొండ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన స్నేహ శబరీష్ బుధవారం హైదరాబాద్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మొక్కను అందజేశారు. సచివాలయంలోని సీఎస్ ఛాంబర్ లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావును కూడా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

# రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేత

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ కాశిబుగ్గలోని 21వ డివిజన్ బీజేపీ 71 వ బూత్ అధ్యక్షుడు దేవులపల్లి రాకేష్ కు ఇటీవల ఆయన భార్య సీకేఎం హాస్పిటల్ లో డెలివరీ అయినందున ఆరోగ్య ఖర్చుల కోసం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ బుధవారం రూ.5 వేలు ఆర్థిక సహాయం చేశారు. వన్నాల వెంకటరమణ సోదరుడు డాక్టర్ వన్నాల అరవింద్ కుమార్ స్థాపించిన సమైక్య వ్యాక్ ఫౌండేషన్ ద్వారా సుమారు 600కు పైగా కుటుంబాలకు నెలకు 10 కిలోల బియ్యం, పలు ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, వారి కంటి చూపు కోసం ఆపరేషన్లు చేయించడం జరుగుతుంది. అంతేకాదు తల్లిదండ్రులు కోల్పోయిన అనాథ పిల్లల చదువుల కొరకు ఆర్థిక సాయం, ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత నోట్ బుక్స్ పంపిణీ వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అపురూప రజనీష్ నేత, వరంగల్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ నోముల రతన్, మండల కార్యదర్శి గాదె భిక్షపతి, సురేందర్ పాల్గొన్నారు



# ఉత్సాహంగా స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్

అక్షర దర్బార్ చిట్యాల: చిట్యాల మండల స్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్ ఉత్సాహంగా జరిగాయి. మంగళవారం చిట్యాల ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధానో ఉపాధ్యాయులు శ్రీరామ్ రఘుపతి అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్పోర్ట్స్ స్కూల్ లో అడ్మిషన్ దొరకడం ఒక వరమని దాని ద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు దొరుకుతాయని తెలిపారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి కోడెపాక రఘుపతి విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక కోఆర్డినేటర్ సూదం సాంబమూర్తి ఫిజికల్ డైరెక్టర్లు బండి ప్రసాద్ నూకల లింగయ్య తెడ్డు సరూప రాణి గాజర్ల శ్రీనివాస్ ఉమా సంగా రఘుపతి ఉపాధ్యాయులు సదయ్య అనిల్ తదితరులు పాల్గొన్నారు



# కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలిపిన టీఈఏ

అక్షర దర్బార్, పరకాల : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియ జేసిన తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ (టీఈఏ) హనుమకొండ జిల్లా



అధ్యక్షులు బొట్ల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు నవీన్ కుమార్, మున్సిపల్ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారపు భాస్కర్, బొక్క ఏలియా, వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.



# విప్లవోద్యమ చరిత్రలో చిట్యాల




- పేద వర్గాలకు అండగా నిలిచి భూస్వాముల పెత్తనాన్ని తరిమిన అన్నలు
- నాడు సమాంతర పాలన నడిపి చిట్యాల మండలాన్ని తమ ప్రయోగశాలగా చేసుకున్న పరిస్థితి
- ఉమ్మడి చిట్యాల మండలం నుంచి 32 మంది అమరులు కాగా మిలిటెంట్లుగా మిగిలిపోయిన 1,200 మంది
- నాటి చర్చల ప్రతినిధి నేడు విగత జీవిగా మారడంతో విషాద ఛాయలు

అక్షరదర్బార్, చిట్యాల:

భూస్వాములు, పెత్తందారులు పెట్టుబడిదారుల అంతు చూస్తూ ప్రభుత్వానికి అనేక సవాళ్లను విసిరి సమాంతర పాలన సాగించిన నాటి పీపుల్స్ వార్ నేటి మావోయిస్టు పార్టీ 40 ఏళ్ల చరిత్ర మరువలేనిది. తాడిత పీడిత బడుగు బలహీన వర్గాల విముక్తి కోసం, భూమి హక్కుల కోసం మొదలైన విప్లవోద్యమం ఒక దశలో ప్రభుత్వానికి సమాంతర పాలన సాగించింది. ఉమ్మడి చిట్యాల మండలం అప్పటి పీపుల్స్ పార్టీకి ప్రయోగశాలగా నిలిచింది. భూస్వాములు, పెట్టుబడిదారులను మండలం నుంచి తరిమికొట్టారు. 1988 సంవత్సరంలో ఇప్పటి టేకుమట్ల మండలం వెంకట్రావుపల్లి బి గ్రామంలో ఓడేడి నారాయణరెడ్డిపై పేలిన తూటాతో విప్లవబీజాలు ఉమ్మడి చిట్యాల మండలంలో పడ్డాయి. అప్పటినుంచి అనేక మందిని ఆకర్షిస్తూ అంచెలంచెలుగా ఎదిగి వందలాది మంది మిలిటెంట్ వ్యవస్థతో ముందుకు సాగింది. కష్టకాలంలో రైతులకు ఆర్థిక చేయూతనందించి వారి ఆదరణను చురుగొన్నది. అనేకమంది పేద వారికి భూస్వాముల భూములను పంచి ఆదుకున్నారు. ఆపై బాల సంఘాలు, విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాలు, రైతు సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, తదితర సంఘాల ఏర్పాటు చేసుకొని చిట్యాల ఉమ్మడి మండలంలో పీపుల్స్ వార్ నాయకులు బలమైన పునాది వేసుకున్నారు. దాదాపు వంద మందికిపైగా అజ్ఞాతంలోకి వెళ్లి ఉద్యమంలో పని చేశారు. నక్సలైట్ల ప్రభావాన్ని తట్టుకోలేని పోలీసులు మొట్టమొదటిసారిగా వెలిశాల గ్రామంలో శాంతిని కాంక్షిస్తూ శాంతిస్తూపాన్ని కట్టించారు. అనంతరం జరిగిన పరిణామాల క్రమంలో పోలీసులు పలు రకాల ఎత్తుగడలు వేసి అజ్ఞాతంలోకి వెళ్లిన కుటుంబ సభ్యులను బంధువులను ఇబ్బందులకు గురి చేస్తూ ఇండ్లను కూల్చివేయడం, దాడులు వంటివి చేశారు. ఎన్ కౌంటర్లలో పలువురు మృత్యువాత పడుతూ మావోయిస్టు పార్టీ బలహీన పడుతూ వచ్చింది.

## - రాష్ట్ర చరిత్రలో వెలిశాల

ప్రస్తుతం టేకుమట్ల పరిధిలో ఉన్న వెలిశాల గ్రామం నక్సల్స్ ఉద్యమంలో రాష్ట్ర, కేంద్రస్థాయి నాయకులను అందించి రాష్ట్ర చరిత్రలోనే నిలిచిపోయింది. వెలిశాల గ్రామంలోని దొరల ఆగడాలను అడ్డుకునే క్రమంలో నక్సలైట్ల ఉద్యమంలో కలిసి పోరుబాట పట్టి ఒకే కుటుంబానికి చెందిన గాజర్ల సారయ్య ఐలియాస్ ఆజాద్, గాజర్ల రవి అలియాస్ గణేష్, గాజర్ల అశోక్ అలియాస్ ఐతులు దశాబ్దాల కాలం నక్సలైట్ల ఉద్యమంలో పాల్గొని వివిధ హోదాల్లో పని చేస్తూ మావోయిస్టు పార్టీలో కేంద్ర కమిటీ స్థాయికి ఎదిగారు. టేకుమట్ల గ్రామానికి చెందిన చెట్టి రాజ పాపయ్య సైతం కేంద్ర కమిటీ సభ్యుడిగా కొనసాగారు. సారయ్య, రవి, రాజ పాపయ్యలు ఎన్కౌంటర్లలో మృతిచెందగా గాజర్ల అశోక్ మాత్రం అనారోగ్య కారణాలవల్ల లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారు. తాజాగా గాజర్ల రవి అలియాస్ గణేష్ నేను కౌంటర్ తో ఆయన ఉద్యమ ప్రస్థానం ముగిసింది.

## - శోకసముద్రంలో వెలిశాల

40 సంవత్సరాల క్రితం పోరుబాట పట్టి ఆజ్ఞాతంలోకి వెళ్లిన గాజర్ల రవి అలియాస్ గణేష్ అనేక ప్రాంతాల్లో వివిధ హోదాల్లో పని చేశారు. ప్రభుత్వంతో జరిపిన చర్చల్లో మావోయిస్టు పార్టీ



తరఫున చర్చల ప్రతినిధిగా తన ప్రతిభను చాటుకుని కేంద్ర కమిటీ స్థాయికి ఎదిగి పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, వారి విముక్తి కోసం అహర్నిశలు మడమతిప్పని పోరాటాలు చేసి ఎన్నో ఎన్కౌంటర్ల నుంచి తప్పించుకున్నారు. అనూహ్యంగా బుధవారం అల్లూరి జిల్లా మారేడుమిల్లి అడవి ప్రాంతంలో జరిగిన ఎన్కౌంటర్లో గణేష్ మృత్యువాత పడడంతో వెలిశాల గ్రామం శోకసముద్రంలో మునిగిపోయింది. ఆయన స్నేహితులు, బంధువులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని పంచుకొని కన్నీటి పర్యంతం అవుతున్నారు. ఆయనతో కలిసి ఉన్న రోజులను గుర్తు చేసుకుంటున్నారు. గాజర్ల రవి ఎన్కౌంటర్లో మృతి చెందాడు అన్న వార్తతో ఉమ్మడి చిట్యాల మండల వ్యాప్తంగా విషాద ఛాయలు అలుముకున్నాయి.

## 32 మందికిపైగా అమరులు

ఉమ్మడి చిట్యాల మండలం నుంచి అజ్ఞాత సాయుధ పోరుబాటను ఎంచుకున్న నక్సలైట్లు ఇప్పటివరకు 32 మంది ఎన్ కౌంటర్లలో మృతి చెందగా అనేకమంది లొంగిపోయారు. మండలము నుండి దాదాపు 1200 మందికిపైగా పోలీసులకు లొంగిపోయి మిలిటెంట్లుగా ముద్ర వేసుకున్నారు. ఉమ్మడి చిట్యాల మండల పరిధిలో వెలిశాల గ్రామానికి చెందిన గాజర్ల రమేష్ అలియాస్ నవీన్, గాజర్ల సారయ్య అలియాస్ ఆజాద్, గాజర్ల రవి అలియాస్ గణేష్, సీపీ గ్రూపునకు చెందిన బోయిన జానీ జంగాపల్లి రాజయ్య, రామకృష్ణాపూర్ (వి)కి చెందిన కట్ల రాజయ్య, కట్ల అశోక్ ఆలియాస్ శ్యామ్, ఆకునూరి సదానందం ఆలియాస్ క్రాంతి, టేకుమట్ల గ్రామానికి చెందిన చెట్టి రాజపాపయ్య అలియాస్ వెంకటరమణ, వేమా రాధా అలియాస్ సుగుణక్క, గర్మిళ్ళపెళ్లికి చెందిన కిరణ్, చైన్ పాకకు చెందిన మారేపల్లి సారయ్య అలియాస్ ప్రసాద్, మారపల్లి లతా అలియాస్ రమక్క, జడల్ పేట గ్రామానికి చెందిన ఉడుత రాజయ్య అలియాస్ వసంత్, బయగాని శ్రీనివాస్ అలియాస్ రంజిత్, దోర్నా ప్రకాష్ రెడ్డి అలియాస్ రమాకాంత్, బావుసింగ్ పల్లికి చెందిన అల్వాల సారయ్య ఆలియాస్ మధు, ఒడితలకు చెందిన మాచర్ల కుమారస్వామి సమ్మక్క, దూత్ పల్లికి చెందిన లక్కాకుల జ్యోతి, గోపాల్పూర్ గ్రామానికి చెందిన మూల రంజిత్, చల్లగరిగ గ్రామస్తులు గోశాల తిరుపతి, దూడపాక శంకర్, గోల్కొండ రమేష్, గంగబోయిన స్వామి, రౌతు విజేందర్, సిరిపెల్లి సుధాకర్, ముచినిపర్తికి చెందిన కందికొండ సుధాకర్ అలియాస్ మహేష్, జూకల్లుకు చెందిన చాడ నరసింహారెడ్డి, అంకుషాపూర్ కు చెందిన దానవేన గట్టయ్య, ఉద్ధమారి సంపత్ తో పాటు మొత్తం 32 మంది నక్సల్స్ అసువులు బాశారు.


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State. Editor : VEMULA RAJESHWER RAO, email : akshardarbarnews@gmail.com, office No : 7680992278 ★ RNI NO. TELTEL/2022/81915